(గత సంచిక తరువాయి)

అతను ఆ ఆట నియమం చెప్పాక ఆ ఆట తాలూకు కార్డ్‌లని అందుకుని ఒకొక్కటీ చదవసాగాడు.

"వైతో పేరు స్టార్ట్ అయ్యేవారంతా దయచేసి నీళ్ళు తాగండి."

ఎవరూ ఆ అక్షరంతో పేరు మొదలయ్యేవారు లేరు.

"అలర్జీస్ ఉన్నవారు తాగండి."

జై బై వూ తాగాడు.

"ఎవరు మీ మొబైల్లోని ఓ ఫోటోని ఆలస్యంగా తీస్తారో వారు తాగండి."

అంతా మొబైల్స్‌ని తెరిచారు. ఆద్య తాగింది.

"ఆఫ్రికా ఖండానికి చెందనివారు ఓ గుక్క తాగండి."

ఒక్కరు తప్ప మిగిలినవారంతా నీళ్ళు తాగారు. కార్లోస్ కూడా తాగి మూడో కార్డ్ తీసి అందులో అచ్చైంది చెప్పాడు.

"ఎప్పుడైనా ఇంజక్షన్స్ తీసుకున్నవారు తాగండి."

అంతా తాగారు.

"ఎన్నడైనా కోర్ట్‌కి వెళ్ళినవారు తాగండి."

ఒక్కరే తాగారు.

"బ్రౌన్ స్కిన్ వారు తాగండి."

చైత్ర, ఆద్య, సల్మాన్ మాత్రం తాగారు.

"నాకు అపోజిట్ జెండర్ వాళ్ళు తాగండి."

ఆడవాళ్ళు మాత్రమే తాగారు.

"కొడుకున్నవారు తాగండి. అద్దె ఇంట్లోని వారు తాగండి. అప్పున్నవారు తాగండి. ఓసారైనా కారు ఏక్సిడెంట్ చేసినవారు తాగండి. స్వంతంగా తెడ్ల పడవని నడపగలిగేవారు తాగండి. ఎన్నడైనా బూతు తిట్లు తిట్టినవారు తాగండి."

ఆద్య ప్రతీసారి తర్వాతిది ఏమై ఉంటుందా అని ఆసక్తిగా ఎదురు చూసింది. తర్వాత అంతా తమ మొబైల్స్‌ని తీసుకున్నారు.

"నా కొలీగ్ నా పని గురించి సోమవారం మీటింగ్‌లో తప్పుపడతాడేమోనని భయంగా ఉంది" సెలవు తీసుకునే చైత్రతో క్రిస్ స్మిత్ చెప్పాడు.

"ఐతే మీటింగ్‌లో అతని పక్కనే కూర్చో. పక్కన కూర్చున్నవారిని క్రిటిసైజ్ చేయడానికి కొంత సైకలాజికల్ సమస్య అడ్డువస్తుంది" చైత్ర సలహా చెప్పింది.

అంతా గ్లాసులని ఖాళీచేసి అక్కడనించి బయలుదేరేసరికి తెల్లవారు ఝామున ఒకటి ముప్పావైంది. అక్కచెల్లెళ్ళు తమ కాంప్లెక్స్‌లోని పక్క బిల్డింగ్స్‌లో ఉండే క్రిస్టీనా లోపెజ్, ఏంద్రూ మిల్స్‌లతో కలిసి ఒకే కారులో ఇంటికి వచ్చారు.

"మంచినీళ్ళు తాగడాన్ని కూడా ఆసక్తికరమైన ఆటగా భలే మార్చారు కదా?" ఆద్య చెప్పింది.

"వెస్ట్‌నర్స్ జీవితాన్ని సాధ్యమైనంత వరకు విసుగులేకుండా జీవించడంగా మారుస్తారు" చైత్ర సరిదిద్దింది.

ఇద్దరూ మర్నాడు ఆలస్యంగా లేచారు.

"నిన్న రాత్రి నీకు ఎలా గడిచింది? ఎక్కడైనా విసుగనిపించిందా?" చైత్ర కాఫీ తాగుతూ చెల్లెల్ని అడిగింది.

"లేదు. నీ కొలీగ్స్ అంతా తెలివిగలవాళ్ళే అనిపించింది."

"తెలివిగలవారికి, మేధావికి మధ్య తేడా చెప్పనా? చదువుకున్నవారు లైబ్రరీ పుస్తకంలాంటివారు. వారి బుర్రనిండా వారు చదివిన సమాచారం నిండి ఉండి, వాళ్ళు ఓ నడిచే ఎన్‌సైక్లోపీడియా అని చెప్పవచ్చు. తెలివిగలవారు డిటెక్టివ్ లేదా సైంటిస్ట్‌లాంటివారు. వాళ్ళు ఊహించి సమస్యని పరిష్కరించగలరు. ఏ సమస్యకైనా త్వరలో తగిన పరిష్కారాన్ని కనుక్కోగలరు. ఇక మేధావులు తాము చదివింది తక్షణం గుర్తు తెచ్చుకుని, సాధారణ మనిషికన్నా ఎక్కువ వేగమైన ఆలోచనా శక్తితో, అంతదాకా ఎవరూ ఆలోచించని కోణంలో ఆలోచించి తక్షణ పరిష్కారాన్ని కనుగొనగలరు."

"అర్థమైంది. అలెక్సీ రైల్లోని చెయిన్ లాగిన ఫైన్ నించి తప్పించుకున్నట్లు."

చైత్ర ఫ్రిజ్‌లోని క్రితం రోజు చేసిన బజ్జీలని పేపర్ నేప్‌కిన్‌లోకి తీసుకుని, మైక్రోవేవ్ ఓవెన్‌లో రెండు నిమిషాలు వేడి చేస్తూ చెప్పింది.

"అవును. లేదా ఆలోచించి కొత్తవి సృష్టించి, ప్రపంచాన్నే మార్చేయగలరు. ఓ సందర్భంలో ఫ్రాన్స్‌లోని ఓ కొలీగ్ నాతో అన్నది. భవిష్యత్‌లో నీ పేరు ఆఖరిసారి ఉచ్చరించబడే రోజు తప్పక వస్తుంది. అలాంటి ఆలోచన మాములు వాళ్ళకి రాదు."

"కార్లోస్ పెళ్ళి చేసుకోలేదా?" ఆద్య అడిగింది.

"అయింది. కాని అతన్ని అతని భార్య నిలువునా ముంచేసింది" చైత్రబాధగా చెప్పింది.

"ఏమైంది?"

"అతను బ్రెజిల్లో పనిచేసేప్పుడు ఆమెతో పరిచయమైంది. అతనికి అమెరికాకి బదిలీ అయింది. ఆమెని పెళ్ళిచేసుకుని టెక్సాస్‌లోని మిడ్‌లేండ్‌కి వచ్చాడు. వారం రోజుల తర్వాత ఓ రోజు ఆఫీస్ నించి అతను ఇంటికి వచ్చేసరికి భార్యలేదు. ఓ చీటీ పెట్టి మాయమైంది. అంతకుముందే ఆమె ప్రేమించిన వ్యక్తి అమెరికాకి వచ్చి పనిచేస్తున్నాడు. ఆమెకి వీసా మంజూరు కాకపోవడంతో అందుకోసం కార్లోస్‌ని చేసుకుని అమెరికాకి వచ్చింది. అతనికి విడాకులు ఇచ్చేసి తన ప్రియుడ్ని పెళ్ళి చేసుకుంది. అది ఎంత బాధించిందో, ఎంత అవమానంగా ఫీలైయ్యాడో కాని కార్లోస్ మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. ఓసారి పార్టీ గేమ్ లో ఎవరికీ తెలీని రహస్యం చెప్పమంటే తాగిన మత్తులో చెప్పాడు."

"పాపం!" ఆద్య సానుభూతిగా చెప్పింది.

"ఇఫియాని వాగ్‌బోగు, అతని భార్యా గుర్తున్నారుగా?" చైత్ర అడిగింది.

"ఆ. నైజీరియన్స్ కదా?"

"అవును. ఓ గేములో 'నిన్ను అమితంగాబాధించేది ఏది?' అనే ప్రశ్నకి జవాబుగా వాళ్ళ తల్లితండ్రులు గత ఇరవై ఏడేళ్ళుగా ఒకరితో మరొకరు మాట్లాడుకోరని చెప్పాడు."

"అయ్యో! ఒకే ఇంట్లో కలిసే ఉంటున్నారా?"

"అవును."

"చిత్రంగా ఉందే? ఎందుకని?"

"కేంప్‌కి వెళ్ళి తిరిగివచ్చాక ఆయనకి తన పెంపుడు కుక్క మరణించిందని తెలిసింది. అది చచ్చిపోయిన సంగతి తనకి తెలియచేయలేదని, సరైన సమయానికి హాస్పిటల్‌కి తీసుకెళ్ళి దానికి సరిగ్గా వైద్యం చేయించి బతికించలేదని, దాన్ని సమాధి చేయకుండా కాల్చేసిందని."

"నిజంగా విచిత్రంగా ఉంది. ఇంకొన్ని గాసిప్‌లు చెప్పు" ఆద్య నవ్వుతూ కోరింది.

"బై బై వూ భార్య మొదటి రాత్రి అతనితో పోట్లాడి హానీమూన్ హోటల్‌లో వేరే గది తీసుకుని వెళ్ళిపోయింది."

"భలే. ఎందుకని?"

"చెత్త హోటల్‌కి హానీమూన్‌కి తెచ్చినందుకట. ఆమె తండ్రి కోటీశ్వరుడు. వారి ప్రావిన్స్‌లో కమ్యూనిస్ట్ పార్టీలో పెద్ద పొజిషన్‌లో ఉన్నాడు. వారికి దుబాయ్‌లో, సింగపూర్, హాంకాంగ్‌లలో చాలా ఆస్తులు ఉన్నాయి. అవన్నీ అక్రమ ఆస్థులు."

"ఇతని భార్యే కదా పిల్లల చదువుకోసం ఆక్రాలో ఉంటోంది?"

"అవును. వాళ్ళక్కడ ఇంటర్నేషనల్ స్కూల్లో చదువుతున్నారు. క్రిస్ స్మిత్ ట్వంటీ ట్వల్వ్‌లో మిస్టర్ కెనడా. చాలా నాటకాల్లో, సినిమాల్లో నటించాడు. అతనికి ఈ ఉద్యోగం నచ్చి ఆ కెరీర్ని వదిలేసి ఆయిల్ ఇండస్ట్రీకి వచ్చాడు."

"చూడగానే బావున్నాడు అనుకున్నాను. పెళ్ళి కాలేదా?"

"విడాకులు కూడా అయ్యాయి. కొడుకు కస్టడీకోసం కోర్ట్‌లో పోరాడాడు. కాని విదేశంలో ఒంటరిగా ఉండే ఉద్యోగం వల్ల కోర్ట్ తల్లికే వాడిని అప్పచెప్పింది."

"ఓ! అందుకనేనా, 'నువ్వు జీవితంలో ఎవర్ని కలవాలో సమయం నిర్ణయిస్తుంది. నీ జీవితంలో నీకు ఎవరు కావాలో హృదయం నిర్ణయిస్తుంది. నీ జీవితంలో ఎవరు ఉంటారో నీ ప్రవర్తన నిర్ణయిస్తుంది ' అన్నాడు?"

"అవును. అతను ఫిలసాఫికల్‌గా మాట్లాడుతూంటాడు. తరచు అతను చెప్పే మాటలు, ఆడవాళ్ళు ప్రేమని నవలగా భావిస్తే మగాళ్ళు చిన్న కథగా భావిస్తారని."

"పాపం! క్రిస్టీనా లోపెజ్?"

"పెరూ. ఆమెకి ఇంకా పెళ్ళికాలేదు. అది బీదదేశం కదా. కాబట్టి డబ్బుకి ప్రాముఖ్యతని ఇస్తారు. తనకన్నా ఎక్కువ సంపాదించే తన దేశస్థుడికోసం వెదుకుతోంది. అతను దొరికితే ఉద్యోగం వదిలేసి వెళ్ళిపోతుందనుకుంటాను. ఏంద్రూ మిల్స్ హోమో సెక్స్‌వల్ అనే వదంతి ఉంది. స్కాటిష్, బ్రిటీష్, ఐరిష్ వారిలో అలాంటివారు చాలామంది ఉంటారట. లివియూ హుతోషి అందరిలోకీ డల్‌హెడ్. కాని కష్టపడి పని చేస్తాడు."

"ఏ దేశంవాడు?"

"లెబనాన్. ఆ దేశంలో ప్రస్థుతం సూపర్ బజార్లలో ధరల లేబిల్స్ ఉండవు. కారణం ఇన్‌ఫ్లేషన్. బ్రెడ్, పెట్రోల్‌లాంటి నిత్యావసర ధరలు రోజుకి చాలాసార్లు పెరిగిపోతూంటాయి. లెబనాన్ సివిల్ వార్ టైములో దేశాన్ని వదిలి సగం మంది ప్రజలు వలస వెళ్ళిపోయారు. వారిలో ఇతనొకడు."

"నా దాకా రాలేదు కాబట్టి నేను చెప్పలేదు కాని నాకూ మన నాన్నతో ఓ జ్ఞాపకం ఉంది. నేను సెవెంత్ చదివేప్పుడు ఫైనల్ ఎగ్జామ్స్ ముందు జ్వరం వచ్చి పడుకున్నాను. లేచి కూర్చుని చదివే ఓపికలేదు. నాన్న శెలవు పెట్టి ప్రతీ పరీక్ష ముందు రోజు నా దగ్గర కూర్చుని ప్రశ్నలని, జవాబులని నాలుగైదు సార్లు చదివి వినిపించారు. దాతో సెవెంత్ పాసయ్యాను" ఆద్య చెప్పింది.

"నాకూ ఓ జ్ఞాపకం ఉంది. నాన్న ఇంటికి వచ్చాక 'అంతా తిన్నారా?' అని అడిగేవారు కదా. తినకుండా నేను కొన్నిసార్లు నిద్రపోయినప్పుడు.."...నువ్వాగు. నేను చెప్తాను. ఆలస్యంగా ఇంటికి వచ్చేసరికి తినకుండా పడుకున్నామని అమ్మ చెపితే నాన్న మనల్ని లేపి కూర్చోపెట్టి నిద్రలోనే మన నోట్లో అన్నం పెట్టి, మంచినీళ్ళు తాగించి పడుకోబెట్టేవారు. ఇదేనా?" ఆద్య పూర్తి చేసింది.

"అవును."

చైత్ర వాట్సప్ అలర్ట్ బెల్ మోగడంతో విని ఆ మెసేజ్‌ని చదివి చెప్పింది.

"వెరా విబావా టంగ్ ట్విస్టర్ చెప్పిందిట. మనం వినలేదు కదా? వంట గదిలో ఉన్నాం. దాన్ని రికార్డ్ చేసి పంపింది."

చైత్ర దాన్ని ఆన్ చేస్తే ఇద్దరూ నవ్వుతూ విన్నారు.

"ఇది ఇండోనేషియన్ టంగ్ ట్విస్టర్. కుకు కకి కకక్ కకక్ కు

కయక్ కుకు కకి కకేక్ కకేక్ కుకు. దీనర్థం నా చెల్లెలి కాలి గోళ్ళు మా తాతయ్య వాటిలా కనిపించాయి."

"మనకి కూడా ఇలా ఏకాక్షరి పద్యాలు కొన్ని ఉన్నాయి. నా దగ్గర ఉండాలి. చూసి వచ్చే శుక్రవారం అది చెప్తాను. బ్రెజిల్ కూడా మన దేశంలా బీద దేశమే. సిమోనే రెన్నోకి వీసా తమాషాగా వచ్చింది. ఓ బొమ్మని నిమిషంలో గీస్తానని అమెరికన్ కన్సులేట్ ఆఫీసర్ ముందు కాగితం మీద అర్థంపర్థం లేని బొమ్మగా కనిపించే బొమ్మని గీసాడు. పూర్తయ్యాక దాన్ని వీసా ఆఫీసర్‌కి ఇచ్చి నవ్వుతూ తలకిందులు చేసి చూడమంటే ఆయన ప్రొఫైలే కనిపించింది. దాంతో అతనికి వీసా ఇచ్చారు."

తల్లి నించి చైత్రకి ఫోన్ వచ్చింది. కొద్దిసేపు మాట్లాడాక చైత్ర చెల్లిలితో చెప్పింది.

"అమ్మతో మాట్లాడు."

ఆద్య తల్లితో గత రాత్రి పార్టీ గురించి మాట్లాడింది. లైన్ కట్ చేసాక చైత్ర చెప్పింది.

"ఇంకా గాసిప్ చాలు. కమాన్. స్విమ్మింగ్ చేద్దువుగాని."

ఇద్దరూ స్విమ్మింగ్ డ్రెస్ వేసుకుని ఆ కాంప్లెక్స్‌లో వెనక ఉన్న ఈత కొలనుకి వెళ్ళారు.

"ఇవాళైనా సైకిల్‌లా స్విమ్మింగ్ వస్తుందో, రాదో చూడాలి" ఆద్య దిగులుగా చెప్పింది.

ప్రవర్ధనకి ఫోన్‌కాల్ వచ్చింది. మాట్లాడటం ఆరంభించాక తన భర్త సంజీవకి టి.వి సౌండ్ తగ్గించమని సౌంజ్ఞ చేసింది. వెంటనే ఆయన రిమోట్ అందుకుని సైలెంట్ మోడ్‌లోకి మార్చి ఆవిడ వంకే చూడసాగాడు. సంభాషణ పూర్తయ్యాక అడిగాడు.

"ఎవరు? మీ సోదరులుంగారేనా?"

"కాదు. మా వదిన. రేపు వాళ్ళ మేరేజ్ ఏనివర్సరీ. పొద్దున్నే సత్యనారాయణ వ్రతం. టైముకి రమ్మని ఆహ్వానం. రేపు సెలవు పెట్టండి."

"నువ్వు పూజగదిలో ఉన్నప్పుడు నాకూ మీ అన్నయ్య ఫోన్ చేసి ఆహ్వానం పలికాడు."

"ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అక్కడే. మనం ఎనిమిదికి అక్కడికి చేరుకోవాలి."

"ధోవతులు, చీర, బ్లౌజ్ పీస్‌లు ఇంట్లో ఉన్నాయా?"

"కొబ్బరికాయ ఉంది. ధోవతులూ ఉన్నాయి. మా వదినకి మంచి చీర కావాలి. నేను వెళ్ళి తెస్తాలెండి" ప్రవర్ధన చెప్పింది.

ఆయన ఘానాలోని తన ఇద్దరు కూతుళ్ళకి మర్నాడు వాట్సప్‌లో పెద మామయ్యకి, అత్తకి మేరేజ్ ఏనివర్సరీ గ్రీటింగ్స్‌ని పంపమని సూచించాడు

"నేను భక్త రామదాసు దగ్గరకి వెళ్ళొస్తాను" భార్యతో చెప్పాడు.

"అలాగే. కాని మీ మొహం గుప్పిట్లో చక్కెర తీసుకుని దొంగతనంగా తిన్న మొహంలా కనిపిస్తోంది. చూడలేక చస్తున్నాం కాని కాస్తంత షేవ్ చేసుకుని వెళ్ళండి" ప్రవర్ధన కోరింది.

ఆయన అరగంట తర్వాత బైక్ ఎక్కి సరాసరి తన మిత్రుడు భక్త రామదాసు ఇంటికి, తర్వాత డాక్టర్ చక్రవర్తి ఇంటికి వెళ్ళాడు. వారితో కాసేపు కాలక్షేపం చేసి, అక్కడనించి మరో మిత్రుడు సిపాయి చిన్నయ్య ఇంటికి వెళ్ళాడు. ఆయన బిజీగా ఉండటంతో ఐదారు నిమిషాల తర్వాత లాయర్ విశ్వనాధ్ ఇంటికి, బడిపంతులు ఇంటికి, మరికొందరి ఇళ్ళకి వెళ్ళాక సూర్యచంద్ర ఇంటికి చేరాడు.

"రారా బాలమిత్రా! బుల్లోడిలా నీట్‌గా తయారయై సూర్యచంద్ర ఇంటికి చంద్రుడికన్నా ముందుగా వచ్చావేమిటి?" సూర్యచంద్ర ఆప్యాయంగా ఆహ్వానించాడు."మనసేం బాలేక నీ దగ్గరకి వచ్చాను."

"సూర్యుడుండగా నేను ఔపోసన పట్టనని మీకు తెలుసుగా. ఆ సమయంలో నాకు మనసు బావుండకపోతే నేనేం చేస్తానో తెలుసా? ఫ్రెండ్స్ ఇళ్ళకి వెళ్ళి కాలక్షేపం చేస్తాను."

"నేను ఇంతదాకా చేసిన నేరం అదే. మనసు బాగుందని చాలామంది దగ్గరకి వెళ్ళాను. అది కాస్తా పాడయ్యేలా వాళ్ళంతా నా అశాంతిని పెంచి పంపారు."

"ఎలా? ఎలా?" సూర్యచంద్ర అడిగాడు.

"ముందు భక్త రామదాసు దగ్గరకి వెళ్ళాను. దాసబోధ చదువుతున్నాడు. పది నిమిషాలు వాడు చెప్పేది విన్నాక నా ఆస్తి మొత్తం బీదలకి పంచేసి, నేను హిమాలయాలకి వెళ్ళకపోవడమే నా కష్టాలకి కారణం అనిపించింది. 'అరె! పరమార్ధం కోసమే ఈ జన్మ' అని గ్రహించనందుకు బాధ కలిగింది. తర్వత లాయర్ విశ్వనాధ్ ఇంటికి వెళ్ళాను. నేను పోయాక నా అపార్ట్‌మెంట్‌ని మా ఎదుటి అపార్ట్‌మెంట్ ఓనర్ ఎంత తేలిగ్గా కొట్టేయగలడో వాడు కేసుల ఉదాహరణలతో సహా వివరించాక ఈ దేశంలో ఆస్థులు ఎంత అభద్రమైనవో అనే కనువిప్పు కలిగి అశాంతి పెరిగింది. తర్వాత డాక్టర్ చక్రవర్తి దగ్గరకి వెళ్ళాను. వాడు ఉదయం అల్పాహారం తీసుకోకపోతే పొట్ట గాయపడుతుందని, ఇరవై నాలుగ్గంటల్లో పది గ్లాసుల మంచినీళ్ళు తాగకపోతే కిడ్నీలు డేమేజ్ అవుతాయని, చల్లని పానీయాలు ఫ్రిజ్‌లో నిన్నటివి తింటే చిన్న పేగు పాడవుతుందని, ఆవకాయలాంటి ఎక్కువ కారంవి తింటే పెద్ద పేగులు గాయపడతాయని, నూనెలో వేయించినవి ఏవి

తిన్నా లివర్, అలాగే తీపి పదార్థాలకి పేంక్రియాస్‌లు గాయపడతాయని చెప్పాడు. నేను నిజంగా ఏభై నాలుగేళ్ళు ఆరోగ్యంగా బతకడం గొప్ప అదృష్టమని, ఇక మీదట ఏమవుతానోననే బెంగతో, ముఖ్యంగా ఆవకాయ, కారప్పొడి మీద బెంగతో మనసు ఇంకాస్త పాడైంది. తర్వాత బిజినెస్‌మేన్ ఇంటికి వెళ్ళాను. వాడు చెప్పింది విన్నాక నేను సంపాదించింది ఎంత స్వల్పమో, కష్టపడకుండా డబ్బు ఎలా సంపాదిచవచ్చో, అందుకు ఇంతదాకా అనవసరంగా ఎంత కష్టపడ్డానో కూడా అర్థమై 'అయ్యో! జీవితాన్ని వృధా చేసుకున్నానే' అనిపించింది. సిపాయి చిన్నయ్య ఇంటికి వెళ్ళాను. మేజర్ చంద్రకాంత్ అక్కడే ఉన్నాడు. వారి బాధ్యతలతో పోలిస్తే దేశానికి మన సేవలు, త్యాగాలు ఎంత ప్రాముఖ్యత లేనివో తెలిసి సిగ్గుపడ్డాను.

చైర్మన్ చెలమయ్య ఇంటికి వెళ్ళాక డబ్బు సంపాదనకి మన చదువులు ఎంత వృథానో అర్థమైంది. బడిపంతులు గాడింటికి వెళ్ళాను. అక్కడ చదువుకున్న అమ్మాయిలని చూసాక నేను కూడా విద్యార్థినైతే ఎంత బావుండేది, ఆనందంగా గడిచే కాలం పోయిందికదా అనే బాధ కలిగింది. రైతు బిడ్డ ఇంటికి వెళితె వెయ్యి రకాలుగా డబ్బు సంపాదించచ్చు కాని, ఆహారం మాత్రం ఒక్క వ్యవసాయం వల్లే సంపాదించగలము అర్థమైంది. రైతు బిడ్డ కష్టపడ్డట్టుగా మనం ఎవరం కష్టపడమని కూడా. పోకిరీ ఇంటికి వెళ్ళాక జెంటిల్‌మేన్‌గా జీవించినంతకాలం లైఫ్‌ని ఎంజాయ్ చేయలేమని అర్థమైంది. ఏతవాతా నా అశాంతి పెరిగి, వాడు పగటిపూటే తాగుతాడు కాబట్టి కిలాడి కృష్ణుడు ఇంటికి వెళితే వాడింకా జైలునుంచి రాలేదని తెలిసింది. దాంతో ఇది పగటి పూటని తెలిసినా నీ దగ్గరకి వచ్చాను."

"నిజమే జీవా! ఇలాగే నేనోసరి నా కజిన్ ఎల్లైసి ఏజంట్ దగ్గరకి వెళితే నేను బతికుండి నా కుటుంబానికి ఎంత ద్రోహం చేస్తున్నానో తెలిసింది. అరోసారి డి. ఆర్.డి ఎల్‌లో పనిచేసే సైంటిస్ట్ బావగారింటికి వెళితే నాకు తెలిసింది ఎంత తక్కువో అర్థమైంది. మా తమ్ముడి కొడుకుని కలవడానికి బేంక్‌కి వెళ్ళాక అంత డబ్బు ఎప్పటికి సంపాదిస్తానా అనిపించింది. మంచి మిత్రుడితో కాలక్షేపం చెయ్యడం స్వర్గంతో సమానం కాబట్టి 'ఇంకా రాత్రవలేదేమి? ఈ వెలుతురు విడిపోలేదేమి?' అని పాడుకున్నాను. దా బాలమిత్రా! ఆల్కహాలే అసలైన మంచి మిత్రుడు. వాడి దగ్గర వద్దన్నా దొరికేది స్వర్గం."

సూర్యచంద్ర కొద్ది క్షణాలు ఆలోచించి చేతి గడియారం వంక చూసుకుని ఆ గది కిటికీ తెరలని మూసేసాడు.

"ఇవాళ ఇంత త్వరగా గంటముందే చీకటి పడిందేమిటి చెప్మా?" చెప్పి లైట్ వేసి, గ్లాసులని, రమ్ బాటిల్‌ని బయటకి తీసాడు.

"ఛీర్స్. మా నాన్న ఎప్పుడూ చెప్తూండేవారు. 'ఒరేయ్! నువ్వు ఎవరితో స్నేహం చేస్తావో ఆలోచించి చెయ్యి' లాయరెప్పుడూ నువ్వు ఇతరులమీద దావా వేయదగ్గ కష్టాల్లో పడాలని కోరుకుంటాడు. డాక్టరెప్పుడూ నువ్వు తన ఫేకల్టీకి చెందిన రోగంతో బాధపడాలని కోరుకుంటాడు. డెంటిస్టైతే నీ పళ్ళు పుచ్చాలనుకుంటాడు. మెకానిక్ నీ కారు పాడవ్వాలని

అనుకుంటాడు. పోలీస్ నువ్వు నేరస్థుడవ్వాలని అనుకుంటాడు. శ్రాద్ధకర్మలు చేసేవాడు నువ్వు చావాలనుకుంటాడు. ఇంటి యజమాని నువ్వు ఎన్నడూ ఇల్లు కట్టుకోకూడదు అనుకుంటాడు. మా నాన్న సలహా దొంగతో స్నేహం చేయమని. వాడొక్కడే నువ్వు ధనవంతుడివి అవాలని కోరుకునేది. కాబట్టి నీకు మనసు బాలేకపోతే నా దగ్గరకి రా తప్ప ఇతర గేంగ్ దగ్గరకి పోక."

"మీ నాన్న లేరా?"

"లేరు. మాఆవిడ వంట బోర్ కొట్టిందని మా తమ్ముడింటికి వెళ్ళారు."

మొదటి గ్లాస్ పూర్తయ్యాక సూర్యచంద్ర చెప్పాడు.

"నిన్న రాత్రి నాకో కల వచ్చింది. నిజానికి అది కలకాదు. ఓసారి మా కుటుంబమంతా తిరుపతికి వెళ్ళినప్పుడు జరిగిందే కలలో కనిపించింది. మా పెట్టెలన్నీ మొస్తూ మెట్లమీదకి చకచకా ఎక్కే కూలీని చూస్తే వాడి బలానికి నాకు ఆశ్చర్యం వేసింది. రైల్లో కిటికీ దగ్గర నేను కూర్చుంటానంటే కాదు నేనని మా చెల్లెలు, నేను పోట్లాడుకోవడం, ఫేన్ తిరక్కపోతే మా నాన్న జేబులోంచి దువ్వెన తీసి దాంతో రెక్కని తిప్పగానే అది గిర్రున తిరగడం, బిస్కెట్లని, కాలక్షేపం బఠాణీలని అమ్మొస్తే, కొనమని మారాం చేస్తే అమ్మ 'ష్...ష్ ' అనడం, రైలాగినప్పుడు మా నాన్న మరచెంబులో ప్లాట్‌ఫాం మీది పంపులో క్యూలో నిలబడి నీళ్ళు తెచ్చేలోగా రైలు కదలొచ్చని భయపడటంలాంటివెన్నో ఆ కల గుర్తు చేసింది."

"అవి నా చిన్నప్పటి అనుభవాలు కూడా" సంజీవ చెప్పాడు.

"మన కళ్ళముందే ఎన్ని మాయమయ్యాయో కదా? పెరట్లోని బావి, పోస్ట్‌మేన్, సైకిల్ రిక్షాలు, సైకిళ్ళు, పిడతకింద పప్పు, మిర్చిమసాలా బళ్ళు, కుంకుడుకాయ, సీకాయ, తర్వాణి, స్కూల్లో మైదానం, ఇంట్లో పూలమొక్కలు, పాళీ పెన్నులు, ప్రేమలేఖలు, పిచ్చుకలు, సాయంత్రం మల్లెపూలతో ఇంటికి రావడం, నాన్నా నాకేం తెచ్చావు అని అడిగే పిల్లలు మాయం. ఇంకా గోళీలు, కర్రాబిళ్ళ, బొంగరాలు. చితపిక్కలు, తాడాట, అష్టాచెమ్మా, వైకుంఠపాళి మాయం."

"నిజమే. 'అల్లం పెసరే' అని అరిచే పాక హోటల్ మాయం. 'సోడా, సోడా ' అనే అరుపు మాయం. కంటికి నిద్ర మాయమై ఆఖరికి మనకి తెలిసినవాళ్ళంతా మొబైల్లోకి మాయం" సంజీవ చెప్పాడు.

"మనం పుట్టింది 1960ల చివర్లో. ఐదు దశాబ్దాలని చూసాం. రెండు వేరే వేరే శతాబ్దాలని కూడా చూసాం. నైన్టీన్ హండ్రెడ్ టు థౌజండ్. క్రీస్తు శకంలో రెండు మిలీనియంలని చూసింది కూడా మనమే. మన పూర్వీకులకు ఆ అదృష్టం లేదు. టెలీఫోన్ ఆపరేటల్ మీద ఆధారపడి వేరే ఊరికి చాలా డబ్బు చెల్లించి మూడు నిమిషాల ట్రంక్‌కాల్ మాట్లాడటం నించి, నేడు ఎక్కడినించైనా, ఎంతసేపైనా, ఎవరితోనైనా, ఎప్పుడైనా వీడియో కాల్‌లో ఉచితంగా మాట్లాడగలగడం, చేత్తో రాసిన ఉత్తరాల కోసం వేచి చూడటం నించి ఇప్పుడు ఇమెయిల్స్ మనకోసం వేచి చూడటం మనమే చూస్తున్నాం." సూర్య చంద్ర చెప్పేది ఆసక్తిగా విన్న సంజీవ చెప్పాడు.

"టూరింగ్ టాకీసుల్లో సింగిల్ ప్రొజెక్టర్‌లో రీలు మార్చేదాకా ఆగి సినిమాని చూసిందీ మనమే. ప్రయాణిస్తూ మొబైల్లో ఇష్టమైన సినిమాని ఎంచుకుని చూసేదీ మనమే. రేడియోలో లైవ్ క్రికెట్ కామెంటరీ వినడంలో ఇచ్చే కిక్ మన తరంవారికే పరిమితం. బ్లాక్ అండ్ వైట్ టి.విని, నేడు హెచ్.డి.టి.విలో వార్తలని, ఓ.టి.టి.లో సినిమాలని చూసే తరం కూడా మనదే భయ్యా. కంప్యూటర్ పంచ్ కార్డ్‌లని చూసాం. డిస్కెట్లని చూసాం. నేడు గిగా బైట్స్. మెగా బైట్స్ మొబైల్స్ చేతిలో జేబులో పెట్టుకుంటున్నాం. ఒకప్పుడు చెప్పులు లేకుండా తిరిగాం. నేడు నైకీ షూస్‌ని ధరిస్తున్నాం. ఇన్‌ఫేంటైల్ పెరాలసిస్, టి.బి, పోలియో, మెనింజైటిస్, స్మాల్ పాక్స్‌లని జయించిన కాలంలో ఉన్నాం. స్వైన్ అండ్ బర్డ్ ఫ్లూని, కోవిడ్ నైన్టీన్‌ని చూస్తున్నాం. 1960లలో పుట్టిన కొందరికి లేని అదృష్టం మనకోటి ఉంది. అదీ రోజు. కొందరు ఈ రోజు దాకా జీవించకుండా హరీమన్నారు"

"నిజమే. ఆ రోజుల్లోని రేడియో కూడా కనుమరుగవలా? ఆనాటి ఆలిండియా రేడియో వైభవం. ఉదయం ఐదున్నరకి సిగ్నేచర్ ట్యూన్. తర్వాత వందేమాతరం పాట. ఆ తర్వాత శుభోదయం శాలివాహన శకం... అంటూ తారీకు. తర్వాత సూక్తి ముక్తావళి, భక్తిరంజని. ఆదివారం ఎల్లారీశ్వరి పాడిన క్రిస్టియన్ భక్తిపాటలు. సోమవారం శ్రీ సూర్యనారాయణ, వేద పారాయణా, ధర్మరక్షామణి, దైవ చూడామణి అనే సూర్యప్రార్థన. శుక్రవారం ముస్లింవి. ప్రతీ శనివారం తప్పనిసరిగా వెంకటేశ్వర సుప్రభాతం. రేడియోవల్లే అది పాపులరైంది.

ఉదయం ఆరున్నరకి పొలం పనులు. ఆరూ ఏభైకి ప్రాంతీయ వార్తలు. ఏడుకి ఢిల్లీనించి వార్తల ప్రసారం. సంస్కృత పాఠం. ఈ పాట నేర్చుకుందాం. పదకొండున్నరకి చిన్నక్క, ఏకాంబరం, రాంబాబు మాటలతో కార్మికుల కార్యక్రమం. దాంతో క్లోజ్. సాయంత్రం పొలం పనులు, ఆరున్నరకి ధరవరలు. ప్రాంతీయ వార్తలు. ఏడుకి ఢిల్లీ వార్తలు. నండూరి సుబ్బారావు, కనకదుర్గలతో కరెంట్ టాపిక్ మీద చర్చ. నిలయ విద్వాంసుల సంగీత కచేరీ, సరస వినోదిని సమస్యా పూరణం, ఇంకా లలిత గీతాలు, నండూరి సుబ్బారావు, సీతారత్నం, కనకదుర్గ కలిసి నటించిన సీతాపతి సంసారం నాకు ఇంకా గుర్తున్న నాటకం. గణపతి, కన్యాశుల్కం, బారిస్టర్ పార్వతీశం, శారదా శ్రీనివాసన్, నండూరి పార్థసారధి, శ్రీరంగం గోపాలరత్నం, ఉషశ్రీ, రామన్న పంతులు, పండగలకి హాస్యనాటకం, ఆదివారం మధ్యాహ్నం రెండున్నరకి బాలానందం కార్యక్రమంలో 'బుజ బుజ రేకుల పిల్లుందా, బుజ్జారేకుల పిల్లుందా? 'పొట్టిబావా....చిట్టిమరదలా...పండక్కి వస్తావా పొట్టిబావా.. నువ్వు పండక్కి వస్తావ పొట్టి బావా....' లాంటి పాటలు. తురగా జానకీరాణిగారనుకుంటా దాన్ని నిర్వహించేవారు. ప్రశ్నోత్తరాలు.... మధ్యాహ్నం కార్మికుల కార్యక్రమంలో ఏదైనా సమస్యని చర్చించేవారు."

(కొనసాగింపు వచ్చే నెలలో)

Post your comments